## క్లుప్తంగా

### ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన గడపగడపకూ

**నల్లజర్ల:** ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం మధ్యాహ్నం నోటిఫికేషన్ జారీ చేయడంతో నల్లజర్లలో ప్రారంభం కావాల్సిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం వాయిదా పడింది. మండలంలో అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తి కాగ చిట్ట చివరి గ్రామం నల్లజర్లలో జరగాల్సి ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ గురువారం వచ్చింది. ఈ కార్యక్రమం తిరిగి మార్చి 16 తర్వాతే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలలో తూర్పుగోదావరి జిల్లా కూడా ఉంది.

### అందరూ ఆధార్ అప్‌డేట్ చేయాలి



ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న ఎంపీపీ యల్లారేశ్వరి

**ఉండ్రాజవరం :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరాలంటే అందరూ తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ అన్నారు. పాలంగి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును గురువారం ఆమె ప్రారంభించారు. ఈ క్యాంపులో ఆమె తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించారు. ఆధార్ కార్డులలో సవరణలు, అప్డేట్, పేరు, చిరునామా మార్పులకు ఈ ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ కార్యదర్శి ఎండి.హసన్‌జానీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాలాటి శరత్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### మత్స్యకారుల సంక్షేమానికి పూర్తి సహకారం



లక్ష్మణరావు, రాధారాణి దంపతులను సన్మానిస్తున్న మత్స్యకార సంఘం సభ్యులు

**నిడదవోలు రూరల్:** మత్స్యకారుల సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ బయ్యే రాధారాణి అన్నారు. తాడిమళ్లలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన సామాజిక భవనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. భవన నిర్మాణానికి రూ.2లక్షలు ఆర్థిక సహాయం చేసిన బయ్యే లక్ష్మణరావు, సర్పంచ్ రాధారాణి దంపతులను మత్స్యకార సంఘం నాయకులు, సభ్యులు ఘనంగా సన్మానించారు.

### ద్వారకా తిరుమల ట్రస్టు బోర్డు మెంబర్‌కు సత్కారం



చిట్టూరి మణి, అన్నవరం దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**కొవ్వూరు:** ద్వారకా తిరుమల దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేసిన చిట్టూరి మణి, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టూరి అన్నవరం దంపతులను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభొట్టి గంగాధర శ్రీనివాస్, పట్టణ పార్టీ గౌరవ అధ్యక్షుడు నగ్గులపాటి శ్రీనివాస్, కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ఏఎంసీ వైస్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి, నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### భారత్ జోడో యాత్రకు మద్దతుగా పాదయాత్ర

**దేవరపల్లి:** భారత్ జోడో యాత్రకు మద్దతుగా పీసీసీ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు డీసీసీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ తెలిపారు. దేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కృష్ణంపాలెం, ధుమంతునిగూడెం, రామన్నపాలెం, సుబ్బరాయపురం, కొత్తగూడెం, దేవరపల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. మార్టిన్ లూథర్ మాట్లాడుతూ భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా గ్రామాల్లో మార్చి 26 వరకూ పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు రఫీయుల్లాబేగ్, పార్టీ జిల్లా మహిళా నాయకురాలు ఆకుల సూర్యభాగ్యలక్ష్మి, పాదయాత్రల జిల్లా ఇన్‌చార్జి గౌతం సత్యేంద్రబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, రాజమహేంద్రవరం సిటీ అధ్యక్షుడు బలేపల్లి మురళీధర్, పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు వడయార్, పీసీసీ సభ్యులు కాకర్ల హరిబాబు పాల్గొన్నారు.

# ఇంటి ముంగిటకు వైద్యం

- పేదల పాలిట వరంగా ఫ్యామిలీ ఫిజీషియన్
- గ్రామాల్లో ఉచిత వైద్య పరీక్షలు
- నియోజకవర్గంలో 20,505 మందికి సేవలు



కానూరులో ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ టీమ్

**పెరవలి:** రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదల పాలిట వరంగా మారింది. గ్రామాల్లో ఇంటి ముంగిటే వైద్య సేవలు అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణులు, బాలింతలకు పరీక్షల నిమిత్తం గతంలో పట్టణాలకు వెళ్లేవారు, ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలులోకి వచ్చిన తరువాత నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకు వైద్యులు వచ్చి పరీక్షలు చేసి, మందులు అందిస్తున్నారు. గతంలో ఏ చిన్న జబ్బు చేసినా, పెద్ద జబ్బు వచ్చినా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని పట్టణాలకు పరుగెట్టేవారు, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నిర్దేశిత సమయంలో గ్రామాల్లో వైద్య బృందం వచ్చి రోగులను నిశితంగా పరీక్షలు చేసి అందుకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఈ వైద్య బృందాలు వచ్చేటప్పటికీ విశేష స్పందన కనిపిస్తోంది.

నిడదవోలు నియోజకవర్గంలో 56 గ్రామాల్లో ఇప్పటి వరకూ 209 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో 20,505 మందికి వైద్య సేవలు పొందారు. దీంతో పేదలు ఆరోగ్యంపై భరోసా కలిగింది. మాకు ఏ జబ్బు చేసినా ప్రభుత్వం ఉందిలే అన్న ధీమా కనిపిస్తోంది.

**సుగర్, బీపీ పేషెంట్లకు భరోసా**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయసుతో సంబంధం లేకుండా సుగర్, బీపీ వంటి రోగాలు పట్టిపీడిస్తున్నాయి. వీటి వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేసుకోలేక ప్రాణాలు మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వమే వైద్యులను పంపించి ప్రతి నెలా రక్త, యూరిన్ తదితర పరీక్షలు చేయిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో నిడదవోలు నియోజకవర్గంలో 9250 మంది సుగర్, బీపీ రోగులకు సేవలు అందుతున్నాయి.

నిడదవోలు నియోజక వర్గంలో మండలాల వారీగా వైద్య సేవలు

| మండలం | వైద్య శిబిరాలు | రోగులు |
|---|---|---|
| పెరవలి | 53 | 4532 |
| ఉండ్రాజవరం | 54 | 4950 |
| కానూరు | 42 | 3767 |
| నిడదవోలు | 62 | 7256 |
| | 209 | 20,505 |



కానూరులో మెడికల్ క్యాంప్‌లో గర్భిణులకు పరీక్షిస్తున్న వైద్యుడు

**ప్రతి నెలా పరీక్షలు**



ప్రతి నెలా వైద్య బృందం గ్రామానికి వచ్చి రక్త, యూరిన్ పరీక్షలు చేసి మందులు ఇస్తోంది. ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే వస్తున్నారు. జబ్బు ఉందని బెంగతో చచ్చే వాళ్లం. ఇప్పుడు భయం లేదు. దీంతో ఆరోగ్యంగా ఉంటున్నాం. దీని వల్ల ఆయుష్షు మరింత పెరుగుతోంది. అందుకు ముఖ్యమంత్రికి జగన్ ధన్యవాదాలు.

– కొవ్వలి అచ్యుత రామయ్య, మునిపల్లి

**మెరుగైన వైద్యం**



నాకు సుగర్ ఉంది. ప్రతి నెలా తణుకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించే వారు. ఇంట్లో ఆర్థిక ఇబ్బంది, పని మానుకుని నన్ను తణుకు తీసుకెళ్లేవారు. ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ పుణ్యామా అంటూ ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. జీవితంపై ఆశ కలుగుతోంది. ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– హనుమంతు జాన్సీ, కానూరు అగ్రహారం

**క్షణంలో వైద్యం**



చిన్న వయస్సులోనే బీపీ వచ్చింది. దీని వల్ల అనేక సార్లు ఇబ్బంది పడ్డాను, గ్రామాల్లోకి ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య బృందం వచ్చిందని చెప్పడంతో చూపించుకున్నాను. క్షణంలో వైద్యం అందిస్తున్నారు. డబ్బులు ఇచ్చి గంటల తరబడి ఆసుపత్రుల్లో సేవల పొందే కంటే ఇక్కడ మనపై ఎంతో ఆప్యాయత చూపిస్తూ ఇంటికే వచ్చి వైద్యం అందిస్తున్నారు.

– బొబ్బిలి సత్యనారాయణ, కానూరు

**అందుబాటులో ఉంటున్నాం**



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. గ్రామాల్లో ఏర్పాటు చేస్తు న్న విలేజి హెల్త్ క్లీనిక్కలకు వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు అందుబాటులో ఉన్నారు. ముఖ్యంగా షుగర్, బీపీపి రోగులకు సేవలు అందించటమే కాకుండా గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఆరోగ్య శ్రీ చికిత్సలు చేయించుకున్న రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

– పి.తేజశ్రీ, వైద్యురాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కానూరు

### ఆదరించి.. వైద్య సేవలు అందించి..



యాచకురాలి చేతి గాయాలకు మందు రాస్తున్న సరిపల్లి రమణ

**నిడదవోలు:** సమాజంలో నిరాదరణకు గురవుతున్న అభాగ్యులకు నిత్యం భోజన, అల్పాహారం, వసతి కల్పిస్తున్న సంజీవని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవలను పలువురు అభినందిస్తున్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద గత కొంత కాలంగా బిక్షాటన చేసుకుంటూ బతుకుతున్న ఓ మహిళ రెండు చేతులకు తీవ్ర గాయాలతో బాధపడతోంది. విషయం తెలుసుకున్న సంస్థ నిర్వాహకుడు, రక్తదాత సరిపల్లి రమణ మెడికల్ కిట్ తీసుకుని వైద్య సేవలు అందించారు. గాయాలైన రెండు అర చేతును శుభ్రం చేసి మందులు అందించారు. అంతే కాకుండా భోజన వసతి కల్పించి మానవత్వాన్ని చాటుకున్నారు.

### జెడ్పీ స్థలం వేలం

**నిడదవోలు రూరల్:** సమిశ్రగూడెం గీతా మందిరం వద్ద ఉన్న జెడ్పీ స్థలాన్ని ఏడాదికి అద్దె ప్రతిపాదికన లీజుకు ఇస్తూ ఎంపీడీఓ టి.మూర్తిబాబు పర్యవేక్షణలో గురువారం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన కస్తూరి వీరవెంకట విద్యాసాగర్ రూ.లక్షకు ఆ స్థలాన్ని దక్కించుకున్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పొలంబడిలో పరిసరాల విశ్లేషణే ముఖ్యం

- ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ సూర్యనారాయణ



వెంకటాయపాలెంలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవశాయశాఖ అధికారులు


**గోపాలపురం:** డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో పరిసరాల విశ్లేషణ చాలా ముఖ్యమని, దాని ద్వారానే పంట సాగు ఆధారపడి ఉంటుందని కాకినాడ జిల్లా పెద్దాపురం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ వీహెచ్‌వీ సూర్యనారాయణ అన్నారు. గోపాలపురం మండలం వెంకటాయపాలెంలో నిర్వహిస్తున్న క్లస్టర్ పొలంబడి క్షేత్రాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా వనరుల కేంద్రం డీడీ ఎ.బోసుబాబుతో కలిసిన సందర్శించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం కాండం తొలుచు పురుగు మాత్రమే పంట పొలాల్లో ఉందని అది కూడా నష్ట పరిమితి స్థాయి కన్నా తక్కువ ఉందన్నారు. ఉధృతి పెరిగేలా ఉంటే తగు మోతాదులో గుళికలు ఉపయోగించాలని సూచించారు. గట్టు మీద మిత్ర పురుగుల ఆకర్షించేలా పూల మొక్కలు నాటాలన్నారు. కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు ఈనెల 20వ తేదీలోగా ఈ పంట నమోదు, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.రంగారావు, ఏవోలు బి.రాజారావు, బి.వెంకన్న బాబు వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

## దైవ సేవకులు సమాజానికి నిర్దేశకులు

**కొవ్వూరు:** దైవ సేవకులు సమాజానికి దిశ నిర్దేశకులని, తమ బోధనాలు, ప్రజలకు మంచి వ్యాక్యలు తెలియడం ద్వారా వారిని సన్మార్గంలో నడిపించడం క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జాన్సన్ పేర్కొన్నారు. పట్టణంలో గోదావరి మేరీ మాత చర్చిలో బుధవారం కృపా రీజెంట్ యునైటెడ్ పాస్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దైవ సేవకులందరూ ఐక్యమత్యంతో పనిచేయాలని సూచించారు. కృపా రీజెంట్ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకే ప్రసాద్, కార్యదర్శిగా పి.రమేష్‌బాబు, కోశాధికారిగా జాన్‌బాబు నియమితులయ్యారు. మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, మల్లిపూడి డేవిడ్, బిషప్ ప్రసాద్‌రాజు, స్వర్ణన్ బాబు, ఏకే కనకరాజు, ఎంబీ అష్కానాజ్, ఎం.జాన్ ఇజ్రాయిల్ తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

- ఆర్డీవో మల్లిబాబు



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో మల్లిబాబు

**కొవ్వూరు:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తరలివచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్డీవో ఎస్.మల్లిబాబు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో గోష్పాదక్షేత్రాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రధాన స్నాన ఘట్టాలు, క్షేత్రంలోని ఆలయా ప్రాంగణాలను తనిఖీ చేశారు. భక్తులు పిండ ప్రధానాల రేవులో కత్రువు నిర్వహించేటట్టు చూడాలని సూచించారు. గోదావరిలో పడి ఉన్న పూజా ద్రవ్యాలు, అపకర్మలకు వాడిన వ్యర్థాలను తొలగించాలని సూచించారు. క్షేత్రంలో ఉన్న ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గోష్పాదక్షేత్రంలో పారిశుద్ధ్యం మెరుగుకి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఇతర సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

## ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించండి

- మెప్మా పీడీ ప్రియంవద

**కొవ్వూరు:** ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించి, ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద పేర్కొన్నారు. పట్టణంలో కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి మహిళల జీవనోపాధిని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు, కొత్త గ్రూపుల ఏర్పాటు, సమావేశాల తీరు, పొదుపు, లాభాలు, ర్యాంలు తదితర అంశాలపై సమీక్షించారు. సంస్థాగత సమన్వయకర్త మోహన్‌కుమార్, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు ఎం.రత్న, సీఎంఎం ఎ.జ్యోతి, సీవోలు బి.సుజాత, టి.రాజ్యలక్ష్మి పట్టణ పరిధిలో ఉన్న మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎలుకల నివారణకు మందు పంపిణీ

**ఉండ్రాజవరం:** గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద శుక్రవారం ఉచితంగా ఎలుకల మందు బ్రోమోడయోలిన్ పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి మీసాల విశ్వాసరావు గురువారం తెలిపారు. రైతులందరూ ఎలుకల మందు కలిపిన వరి నూకలను చిన్న చిన్న పేపర్ పొట్లాలుగా కట్టి తెరిచి ఉన్న ఎలుకల కన్నం వద్ద ఉంచాలన్నారు. ఎలుకలు వాటిని తిని 5, 6 రోజుల్లో క్రమేపి చనిపోతాయని తెలిపారు.

**నిడదవోలు రూరల్:** రబీలో పంటలను నాశనం చేస్తున్న ఎలుకలను నిర్మూలించేందుకు శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్టు మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ గురువారం తెలిపారు. మండలంలోని 22 రైతు భరోసా కేంద్రాల వద్ద బ్రోమోడయోలిన్ ఎలుకల మందుతో పాటు నూకలతో కలిసిన పొట్లాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందని తెలిపారు.

**చాగల్లు:** పంట పొలాల్లో ఎలుకల నిర్మూలనకు ఉచితంగా మందును పంపిణీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. చాగల్లులో ఆర్‌బీకే కేంద్రం వద్ద రైతులకు గురువారం ఉచితంగా ఎలుకల మందు బ్రోమోడయోలిన్‌ను పంపిణీ చేశారు. జిల్లాలో 19 మండలాల్లో ప్రభుత్వం ఉచితంగా రైతులకు ఎలుకల నివారణ మందును పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఏ బోసుబాబు, ఏడీఏ ఎస్‌వీఎస్ రంగారావు, నరసింహారావు, ఏడీఏ చంద్రశేఖర్, వ్యవసాయాధికారి కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వ పథకాల నియోజకవర్గ కన్వీనర్‌గా రవీంద్ర

**దేవరపల్లి:** కేంద్ర ప్రభుత్వ పథకాల గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్‌గా దేవరపల్లి మండలం బందపురానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాట్రగడ్డ రవీంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంలో జరిగిన శక్తి కేంద్రాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపాలపురం నియోజకవర్గంలో శక్తి కేంద్రాల పార్లమెంట్ జిల్లా ఇన్‌చార్జి కేంద్ర మంత్రి పర్యటనపై చర్చించినినట్టు బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దున్నా సుమన్‌బాబు తెలిపారు.

### మురుగునీరు పోయేందుకు ప్రత్యేక చర్యలు



ప్రధాన రహదారిపై కల్వర్టు పనులు

**నిడదవోలు:** పట్టణంలో మురుగునీరు పారుదలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షల వ్యయంతో పట్టణంలో సోమేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రధాన రహదారిపై రజకవీధి, రాయిపేట ప్రాంతాల్లో నిర్మిస్తున్న కల్వర్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనలను మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ పరిశీలించారు.

### పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

**నిడదవోలు:** పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. పట్టణంలో షాదీఖానాలో గురువారం బీజేపీ ప్రవాస్ యోజన నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేలంగి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర, ప్రవాస్ యోజన జిల్లా కన్వీనర్ కురకంటి సతీష్, కుట్టిపల్లి శివనాగరాజు, బండ సత్యనారాయణ, బండారు రాంబాబు, ఎస్.గంగాధర్, బూరుగుపల్లి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పాన్ షాపు దగ్ధం

**చాగల్లు:** బ్రాహ్మణగూడెంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పాన్ షాపు దగ్ధమైంది. గ్రామంలో రాచపోతు సీతారామయ్యకు చెందిన తాటాకిల్లులో నిర్వహిస్తున్న పాన్‌షాపు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని దగ్ధమైంది. ఆ సమయంలో షాపులో ఉన్న సీతారామయ్యను స్థానికులు కాపాడారు. నిడదవోలు ఫైర్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్ట వివరాలు తెలియాల్సి ఉంది.

### మిడ్డే మీల్స్ నాణ్యతతో అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ వీరాస్వామి

**చాగల్లు:** పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. చాగల్లు మండలం మార్కొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారికి భోజనం అందుతున్న తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని, ఉపాధ్యాయులు కూడా పర్యవేక్షించాలన్నారు.

## డ్రోన్ రీసర్వేతో కచ్చితమైన రికార్డులు



వేలివెన్నులో రీసర్వేను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ భాస్కరరామయ్య

**ఉండ్రాజవరం:** రైతులు తమ భూములకు సంబంధించిన కచ్చితమైన డిజిటల్ రికార్డులను పొందే అవకాశం డ్రోన్ రీ–సర్వే ద్వారా కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. వేలివెన్ను గ్రామంలో గురువారం డ్రోన్ సర్వే కార్యక్రమం ఆయన పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఓ మంచి కార్యక్రమానికి పూనుకుందని, రీసర్వే ద్వారా ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూముల వివరాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమం చేపట్టడం వలన భవిష్యత్తులో కూడా భూ సంబంధ సమస్యలు ఉండవన్నారు. కాబట్టి అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీ–సర్వే డీటీ ఎస్.జయలక్ష్మి, మండల సర్వేయర్ వి.నాగేంద్రబాబు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు మురళి, ఏసుపాదం, శ్రీనివాసు, సర్వే ఆఫ్ ఇండియా టీమ్ ఇన్‌చార్జి జీవీఎం నాయుడు, రైతులు పాల్గొన్నారు.

## బోర్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి

- వైఎస్సార్ జలకళ బోర్లను పరిశీలించిన డైరెక్టర్ మునిరెడ్డి



బోరు డ్రిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న వెంకటరామమునిరెడ్డి

**దేవరపల్లి:** వైఎస్సార్ జలకళ పథకంలో బోర్ల నిర్మాణం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పి.వెంకటరామ మునిరెడ్డి అధికారులను ఆదేశించారు. పల్లంట్లలో వైఎస్సార్ జలకళ పథకంలో వేస్తున్న బోరు డ్రిల్లింగ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. డైరెక్టర్ వెంకటరామమునిరెడ్డి మాట్లాడుతూ జలకళ పథకంలో ఎక్కువ బోర్లు వేసి రైతులకు మేలు చేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. వేసవిలో ఎక్కువ బోర్లు వేయాలని సూచించారు. వాటికి విద్యుత్ సదుపాయం రైతులే ఏర్పాటు చేసుకోవాలన్నారు. మోటార్లు ప్రభుత్వం ఇస్తుందన్నారు. దేవరపల్లి మండలంలో 178 బోర్లు మంజూరు కాగా 49 బోర్లు డ్రిలింగ్ జరుగుతున్నాయని ఆయన తెలిపారు. 129 బోర్లు డ్రిల్లింగ్ చేయాల్సి ఉందని, కార్యక్రమంలో వాటర్ షెడ్ మండల అధికారి రమేష్, రైతులు పాల్గొన్నారు.

### ఘనంగా చండీ హోమం




చండీ హోమాన్ని తిలకిస్తున్న మహిళలు

**ఉండ్రాజవరం:** గ్రామంలోని గండిపోశమ్మ తల్లి విగ్రహ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గురువారం వేదపండితులు, అర్చకుల శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. టీటీడీ వేద పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితులు ఆధ్వర్యంలో గణపతి పూజ, మహలింగార్చన, హోమం నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ,భారీ అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### సోమేశ్వరునికి పూజలు

**నిడదవోలు:** పట్టణంలోని బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా గురువారం విజయ గణపతి స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నామాల శివ, భక్తులు పాల్గొన్నారు.

### 33 కేవీ విద్యుత్ లైన్ల మార్పు



33కేవీ విద్యుత్ లైన్‌లను తొలగిస్తున్న దృశ్యం

**తాళ్లపూడి:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనలో చిన్నారి బాలుడి మృతికి కారణమైన 33 కేవీ విద్యుత్ లైన్లను మార్పు చేసినట్టు ట్రాన్స్‌కో ఏడీఏ అచ్యుతాచారి తెలిపారు. ప్రమాద భరితమైన లైను మార్చడానికి వినియోగదారుల నుంచి రూ.2.38 లక్షలు డిమాండ్ కట్టించి, మార్పు పనులు గురువారం పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. అప్పట్లో వివిధ పత్రికల్లో, మీడియాలో వచ్చిన కథనాలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని, 33 కేవీ లైన్ వేసిన తరువాతే నివాసం నిర్మించుకున్నారని, అయినప్పటికీ 33 కేవీ లైన్ తొలగించాలన్న డిమాండ్ మేరకు నాయకుల, అధికారుల మౌలిక ఆదేశాల మేరకు ఆ ఇంటి వద్ద ఉన్న వైర్లను తొలగించామని అన్నారు. శాఖాపరంగా మార్పు చేర్పులకు తగిన సొమ్ము కడితేనే గాని సాధ్యం కాదని అందువల్లే ఆ లైన్ మార్పులకు ఆలస్యమైందని తెలిపారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో అనుమతులతో 33 కేవీ వైర్లను తమ సిబ్బంది సహకారంతో తొలగించినట్టు తెలిపారు.